క్లుప్తంగా

బహిరంగ వేలం

చేవెళ్ల: చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలాన్ని అద్దెకు ఇచ్చేందుకు ఈ నెల 30న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరేందర్ తెలిపారు. బాలాజీ వేంకటేశ్వరస్వామి ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయం పక్కన 180 గజాల ఖాళీ స్థలం ఉందన్నారు. ఈ స్థలాన్ని 3 సంవత్సరాల కాల పరిమితి నిమిత్తం షాపులు ఏర్పాటు చేసుకోవడానికి బహిరంగ వేలం వేయనున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఖాళీ స్థలానికి రూ.10వేలు, షాపునకు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. ఈ నెల 30న ఉదయం 11 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో జరిగే బహిరంగ వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని ఈఓ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పోలీసులు నిజాలు దాచారంటూ బంధువుల ధర్నా



శ్రవణ్ (ఫైల్)

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అయితే పోలీసులు నిజాలు దాచారని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈనెల 7న పల్టాన్‌కు చెందిన శ్రావణ్ మన్వర్(24) అనే వ్యక్తి అర్ధరాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో నల్గొండ క్రాస్‌రోడ్స్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే హాస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 11న మృతి చెందాడు. అయితే శ్రవణ్ కనిపించడంలేదంటూ అతని కుటుంబ సభ్యులు ఈనెల 11న పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శ్రవణ్ మృతి చెందాడని తెలియడంతో అతని బంధువులు న్యాయం చేయాలంటూ పీఎస్ ముందు ధర్నా నిర్వహించారు. పోలీసుల అలసత్వం కారణంగానే శ్రవణ్ చికిత్స వివరాలు తమకు తెలియలేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల పుటేజ్ ఆధారంగా విచారణ చేస్తున్నామని, త్వరలో కేసును ఛేదిస్తామని సీఐ ప్రకాష్‌రెడ్డి మృతుడి బంధువులకు చెప్పి పంపించి వేశారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ తెలిపారు.

మిథానీ కాలనీ కార్యవర్గం ఎన్నిక

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని మిథానీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెల దేవేందర్, ప్రధాన కార్యదర్శి నడిపల్లి భిక్షపతి, కోశాధికారి హరిశంకర్, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా నక్కవాసు, ముఖ్య సలహాదారుడిగా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లెల రవిశంకర్, విజయ, లోక్యానాయక్‌ను ఎన్నుకున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఎక్సైజ్ సీఐ భద్యచౌహాన్

ఆమనగల్లు: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలు తీసుకుంటామని ఆమనగల్ ఎక్సైజ్ సీఐ భద్యచౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఆదివారం సీఐ మాట్లాడుతూ.. నూతన సంవత్సర సందర్భంగా ఈవెంట్లు నిర్వహించేవారు ముందస్తుగా అనుమతి తీసుకొని ఈవెంట్లలో మద్యం వాడాలని సూచించారు. ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాల పరిధిలో ఉన్న రిసార్ట్స్, ఫంక్షన్‌హాళ్లలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేవారు తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ఈవెంట్స్ నిర్వాహకులు విధిగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తీసుకొని ఈవెంట్లలో మద్యం సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రీ క్రిస్మస్ సంబరాలు

సర్పంచ్ అశోకవర్ధన్‌రెడ్డి



కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ అశోకవర్ధన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆయుధం పట్టని దేవుడు ఏసుక్రీస్తు మాత్రమేనని ఎల్మినేడు సర్పంచ్ అశోకవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడులో ఎంబీ షాలేం చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సొంత డబ్బులు రూ.75వేలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, క్రైస్తవులతో కలిసి చర్చిలో కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చిలో చిన్నారులు యేసు జ్ఞాపకార్థం వేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు రూ.8వేల నగదు అందజేశారు. ఉప సర్పంచ్ మార్తా, మతపెద్దలు పాస్టర్ జోష్వా, ఆశీర్వాదం, దండు దాసు, జుట్టు సతీష్, సోమరాజు, విజయకాంత్, అనిల్, ప్రభాకర్, సురేష్, రవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పదునెట్టాంబడికి వేళాయె

- మామిడిపల్లి అయ్యప్ప ఆలయంలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
- శబరిమల మాదిరిగా పడిమెట్లు ఎక్కే అవకాశం



మామిడిపల్లిలోని అయ్యప్ప స్వామి దేవాలయం

పహాడీషరీఫ్: 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ మాలధారణ ధరించి ఇరుముడి కట్టుకొని శబరిమల ఆలయానికి భక్తులు పోటెత్తుతారు. పదునెట్టాంబడి(18 మెట్లు) సందర్భంగా శరణు ఘోషతో మార్మోగుతుంటాయి. అలాంటి భావన ప్రతిబింబించేటట్లుగా బాలాపూర్ మండలంలోని మామిడిపల్లి శ్రీ బాల మణికంఠ అయ్యప్పస్వామి దేవస్థానం రూపుదాల్చుకుంది. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాది మండల మహాపడిపూజ సందర్భంగా భక్తులకు ఇక్కడి 18 మెట్లు ఎక్కే అవకాశం కల్పిస్తున్నారు. ఈ నెల 26న జరగనున్న మహా పడిపూజ మహోత్సవానికి అయ్యప్ప స్వాములు భారీగా తరలి రానున్నారు. సన్నిధిలో విఘ్నేశ్వరుడు, లక్ష్మీదేవి, సుబ్రహ్మణ్య స్వామి, రాహుకేతువు ఆలయాలు కూడా నిర్మించారు.

అయ్యప్ప నామస్మరణతో

మామిడిపల్లి గ్రామాన్ని ఆనుకొని పంట పొలాలలో 2006లో శంకుస్థాపన చేసిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని 2015లో పూర్తి చేసి విగ్రహ ప్రతిష్టాపన చేశారు. మొదటి సంవత్సరం నుంచే పెద్ద సంఖ్యలో మాలధారణ చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో ఏటా ఇక్కడ పెద్దఎత్తున మహా పడిపూజ నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఇక్కడ మాలధారణ వేసే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడ నుంచి అయ్యప్ప స్వాములు శబరిమలకి పాదయాత్ర సైతం చేస్తున్నారు. శబరిమలకు వెళ్లలేని స్థితిలో ఉన్న వారికి ఇక్కడే ఇరుముడిలు తీస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు దర్శించుకుంటున్నారు. అయ్యప్ప సీజన్‌తో పాటు ప్రతి బుధవారం, ప్రత్యేక ఉత్సవాల సమయంలో ఇక్కడ హరిహరసుతుని నామస్మరణ కొనసాగుతోంది.



పదునెట్టాంబడి ఎక్కుతున్న భక్తులు (ఫైల్)

పెద్ద ఎత్తున భక్తుల రాక



పరిసర గ్రామాల నుంచి భక్తులు ఇక్కడికి పెద్ద ఎత్తున వస్తున్నారు. 31 ఏళ్లుగా అయ్యప్ప మాలధారణ వేసి స్వామి వారి సేవలో గడుపుతున్నా. ఆదివారం గణపతి హోమం, ధ్వజారోహణం నిర్వహించాం. 25న లక్ష పుష్పార్చన, స్వామి వారి ఊరేగింపు, 26న అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం నిర్వహించనున్నాం. కేరళ ఆలయ సహాయ అర్చకుడు ఉన్నికృష్ణన్ నంబూద్రీ పర్యవేక్షణలో పూజలు కొనసాగుతాయి. కార్యక్రమానికి ప్రముఖులు హాజరుకానున్నారు.

– మద్ది జగదీశ్వర్ రెడ్డి గురుస్వామి, ఆలయ ధర్మకర్త

కనుల పండువగా పల్లకీ సేవ

మామిడిపల్లిలో వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి పల్లకీ సేవ ఊరేగింపు ఆలయ మాడ వీధులలో నేత్రపర్వంగా కొనసాగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ప్రధాన అర్చకుడు యు.సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన పల్లకీ సేవలో భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ వాల్మీకి, ఈవో మురళీ కృష్ణ, కార్పొరేటర్లు పవన్‌కుమార్ యాదవ్, శివకుమార్, దాతలు కృష్ణారెడ్డి, నరేందర్ గౌడ్, దామోదర్ సచిన్ సోని, పాలక మండలి సభ్యులు పద్మశంకర్ గౌడ్, కృష్ణ నాయి, సహదేవ్, అశోక్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



సాగు బాట.. కొంగల వేట

కందుకూరు: ప్రకృతి ప్రసాదించిన పరిసరాలు రమణీయతతో ఉంటాయి. సమస్త జీవరాసులు అందులోని అదనపు హంగులు. వరి నాట్ల కోసం ఓ రైతు పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా మరోపక్క ఆహారం కోసం కొంగలు వేట సాగిస్తున్నాయి. ఈ దృశ్యం మండల పరిధిలోని జైత్వారం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో కనిపించింది.

క్రిస్మస్‌కు ముస్తాబు

- విద్యుద్దీపాలతో ప్రార్థనా మందిరాలు
- దుబ్బచర్ల లిల్లీపూర్‌లో మెరిసిపోతున్న సెయింట్ థామస్ చర్చి



రంగుల దీపాలతో మెరిసిపోతున్న క్రీస్తు శిలువ

మహేశ్వరం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చర్చీలు ముస్తాబయ్యాయి. ఆదివారం దుబ్బచర్ల గ్రామ పంచాయతీ లిల్లీపూర్‌లో సెయింట్ థామస్ చర్చి, కేకే బస్తీలో ఉన్న మరియమాత చర్చి, మండల కేంద్రంలో ఉన్న ఎంబీ చర్చి, చిన్నతూప్ర గ్రామాల్లోని ప్రార్థనా మందిరాలు విద్యుద్దీపాలతో వెలుగుతున్నాయి. డెకరేషన్స్, స్టార్స్, క్రిస్మస్ ట్రీ, రంగు రంగుల బొమ్మలతో సర్వంగా సుదరంగా ముస్తాబు చేశారు. లిల్లీపూర్ చర్చిలో క్రైస్తవులు కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. క్రీస్తు బోధనలు బోధించి, నాటికలు వేశారు. కార్యక్రమంలో ఫాదర్ డానియేల్, సర్పంచ్ స్లీవారెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాలతో అలంకరించిన సెయింట్ థామస్ చర్చి

4 నుంచి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ సంయుక్త ఆధ్వర్యంలో యోనెక్స్ సన్‌రైజ్ 9వ, తెలంగాణ రాష్ట్రస్థాయి గుజ్జుల సుధాకర్‌రెడ్డి మెమోరియల్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2024 పోటీలను నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస్ రావు తెలిపారు. ఆదివారం మూసారంబాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా, అల్మాస్‌గూడ, బీఎన్‌రెడ్డినగర్, ఏవైఆర్ క్రికెట్ గ్రౌండ్ పక్కన, ఫిట్‌నెస్‌ఫ్రీక్ అరేనా, సుధాకర్‌రెడ్డి బ్యాడ్మింటన్ అకాడమీలో జనవరి 4 నుంచి 7 వరకు పోటీలు జరుగుతాయన్నారు. పురుషులు, మహిళల విభాగాలలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్ పోటీలు జరుగుతాయన్నారు. నేషనల్ మాస్టర్స్ (వెటరన్) బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక పోటీలని, ఈ నెల 31 తేదీలోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనే క్రీడాకారులు వెబ్‌సైట్ లింక్ htt pr:// btso n i ne.i n/ ద్వారా చేసుకోవచ్చన్నారు. వివరాలకు 98660 14607 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సావిత్రి సుధాకర్‌రెడ్డి, జిల్లా వైస్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బ్యాట్ జాయింట్ సెక్రటరీ యూవీఎన్ బాబు ఉన్నారు.

చూడ ముచ్చటగా పిచ్చుకల తోరణం



మరియాపూరంలో విద్యుత్ వైర్లపై వాలిన పిట్టలు

షాబాద్: షాబాద్ మండల పరిధిలోని మరియాపూరం గ్రామంలో విద్యుత్ వైర్లపై పిట్టలు వాలి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం ఉదయం విద్యుత్‌వైర్లపై కిలోమీటర్ల పొడవునా అవి వైర్లపై కూర్చున్నాయి. ఆ దృశ్యాలు గ్రామస్తులను కనువిందుచేశాయి.

కరిగెట్లో విరిగిన విద్యుత్ స్తంభం

- ఇబ్బందుల్లో రైతులు
- పంట పొలాల్లోకి వెళ్లాలంటే జంకుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

షాబాద్: పంట పొలాల్లో విద్యుత్ వైర్లు వ్రేలాడుతూ యమపాశాలుగా మారుతున్నాయి. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో రైతు పెద్దజంగని శ్రీనివాస్ వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం విరిగి కరిగెట్లో పడింది. ప్రమాదవశాత్తు అక్కడ రైతులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయమై విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని రైతులు మండిపడ్డారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న తమ ప్రాణాలు గాల్లో కలుస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లూప్ వైర్ల కారణంగా మండలంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా విద్యుత్ అధికారుల్లో మాత్రం చలనం లేదు. పచ్చని పంట పొలాల్లో యమపాశాలుగా వ్రేలాడే విద్యుత్ వైర్లు చేతికి అందే స్థితిలో ఉన్నా వాటిని సరిచేసే నాధుడే లేరని వారు వాపోయారు. రైతులు, గ్రామస్తులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విద్యుత్ వైర్లతో తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నా స్పందించే అధికారులు కరువయ్యారు.



విరిగి పడిన విద్యుత్ స్తంభం

గత వైభవం వచ్చేనా?

కొత్తూరు పారిశ్రామికవాడలో సమస్యల తిష్ట	ధ్వంసమైన రోడ్లు, వెలగని లైట్లు	నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతున్న షెడ్లు	సౌకర్యాలు కల్పించాలని స్థానికుల మొర



వృథాగా పారిశ్రామిక వాడలోని ఓ షెడ్డు

కొత్తూరు: రాష్ట్రంలోనే వెనుకబడిన జిల్లాగా పేరొందిన పాలమూరులో వలసలను నియంత్రించి జిల్లాను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హైదరాబాద్‌కు కూతవేటు దూరంలోని కొత్తూరు మండలకేంద్రంలో 1976లో పారిశ్రామిక వాడను ఏర్పాటుచేశారు. మొదట్లో సుమారు 60నుంచి 80 వరకు చిన్న తరహా, పెద్ద పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీంతో ఇక్కడి పారిశ్రామిక వాడకు రోడ్డు, రైలు, రవాణా సౌకర్యం కల్పించారు. ఇది హైదరాబాద్‌కు అతి దగ్గరగా ఉండడంతో రెండేళ్ల లోపే ఇక్కడ వందల సంఖ్యలో పరిశ్రమలు నెలకొన్నాయి. గతంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ట్రాన్స్‌పోర్ట్ లారీలు, కార్మికులతో కిటకిటలాడేది. బీహార్, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన వేల మంది కార్మికులు ఉపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చి జీవనోపాధి సాగించేవారు. కొన్నేళ్ల నుంచి ఆయా కారణాలతో పలు పరిశ్రమలు మూత పడడం మరికొన్ని కాలుష్య కారణంగా మరో చోటుకు తరలి పోవడంతో పరిస్థితి పూర్తిగా మారింది.



రోడ్లపై పెరిగిన కంపచెట్లు

నెలకొన్న సమస్యలు..

- ప్రస్తుతం పారిశ్రామికవాడలో చాలా షెడ్లు నిర్వాహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి.
- అంతర్గత రోడ్లకు గత కొన్నేళ్ల నుంచి కనీస మరమ్మతులు లేక గుంతలమయంగా మారాయి. వర్షాకాలంలో ఈ రోడ్లపై నుంచి రాకపోకల సమయంలో వాహనదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.
- ఆయా ప్రాంతాల నుంచి పరిశ్రమలకు సరుకులు తీసుకెళ్లడం, సరుకులు తేవడానికి వచ్చే డ్రైవర్లు, కార్మికులకు విశ్రాంతి తీసుకునేందుకు గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- తాగునీరు, మరుగుదొడ్లు లేక కార్మికులు, డ్రైవర్లు కష్టాలు ఎదుర్కొంటున్నారు.
- ముఖ్యంగా వీధి దీపాలు లేక పారిశ్రామికవాడలోని అంతర్గత రోడ్లపై చీకట్లు అలుముకొని భయానక వాతావరణం నెలకొంటుంది.

హెచ్‌ఎండీఏ పరిధిలోకి రావడంతో..

రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరు మండలం ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలోకి రావడంతో హైదరాబాద్ సమీపంలోని పలు చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు మండలంలోని పారిశ్రామిక వాడలో పలు పరిశ్రమలను నెలకొల్పే ప్రయత్నంలో ఉన్నారు. కొందరు పరిశ్రమల నిర్వాహకులు ఇప్పటికే పారిశ్రామికవాడతో పాటు పలు ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం భూములను సైతం కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం, పాలకులు స్పందించి పరిశ్రమలను ఇక్కడే ఏర్పాటు చేసి పారిశ్రామిక వాడకు గత వైభవాన్ని తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



పారిశ్రామికవాడలో పలు పరిశ్రమలకు నిత్యం ఆయా రాష్ట్రాల నుంచి లారీలు వస్తుంటాయి. ఇక్కడ లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో ఇక్కడి పరిశ్రమల్లో కనీస సౌకర్యాలు లేని కారణంగా డ్రైవర్లు రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. దానికి తోడు హమాలీలు, కార్మికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పారిశ్రామికవాడలో విశ్రాంతి గదులు, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

–పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన రాఘవేందర్‌గౌడ్ ఇటీవల మృతిచెందారు. ఆదివారం విషయం తెలుసుకున్న తాలూకా గౌడ సంఘం అధ్యక్షుడు చుక్కా అల్లాజీగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వ్యక్తిగతంగా రూ. 5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్య క్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు బాలకుమార్‌గౌడ్, తాలూకా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రవీందర్‌గౌడ్, నరసింహ గౌడ్, ఆంజనేయులుగౌడ్, విష్ణుగౌడ్, మల్లేష్ గౌడ్, రామస్వామిగౌడ్, ఈశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

సీఐ కాశీవిశ్వనాథ్

మంచాల: యువత సామాజిక బాధ్యతతో మెలగాలని మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ అన్నారు. ఆదివారం ఆరుట్ల ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ఎదుగుదలతో పాటు మానసిక తృప్తిని కలిగిస్తాయని అన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. చెడువ్యసనాలకు దూరంగా క్రమ శిక్షణతో మెలగాలన్నారు. చదువుతో పాటు ఆటలు, తమకు నచ్చిన రంగాల్లో రాణించాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా ప్రజలందరు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రమేష్, కావలి శ్రీనివాస్, ఎస్సై రవినాయక్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం



విరాళాల సేకరణలో సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో మజీద్‌పూర్‌లో ఆదివారం వందేమాతరం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'ఇంటికి వంద–బడికి చందా' అనే నినాదంతో విరాళాల సేకరణ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుధాకర్‌రెడ్డితో పాటు గ్రామానికి చెందిన హన్మంతు, గోపగోని శ్రీశైలంగౌడ్‌లతో పాటు పలువురు విరాళాలు అందించగా మొత్తం రూ.5.30లక్షలు విరాళాలుగా వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు.

దైవచింతన కలిగి ఉండాలి



మహాసభలో పాల్గొన్న పీఠాధిపతులు

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని యజ్ఞపల్క్య ఆశ్రమ పీఠాధిపతి పరవిద్యానందగిరి మాతాజీ అన్నారు. ఆమనగల్ పట్టణంలోని శీ నిత్యశుద్దానంద స్వామి క్షేత్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామదూత ఆశ్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. అంతకుముందు బ్రహ్మశ్రీ రాజేష్ శర్మ, శివానంద స్వామి ఆధ్వర్యంలో వాస్తు పూజ హోం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విష్ణుసహస్ర పారాయణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పీఠాధిపతులు పాల్గొన్నారు.

లక్ష్మీనారసింహుడికి పల్లకీ సేవ

ఇబ్రహీంపట్నం రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలోని లక్ష్మీనరసింహ స్వామి హాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో స్వామివారిని పల్లకీపై ఊరేగించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ యాదగిరి, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



పల్లకీసేవలో భక్తులు